వేగంగా ఓపెన్ ఆడిటోరియం నిర్మాణ పనులు

- ఓపెన్ ఆడిటోరియంగా మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్ అభివృద్ధి
- రూ.3.50 కోట్లతో నిర్మాణం మరో మూడు నెలల్లో అందుబాటులోకి



నరసాపురం పాత మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్ (ఫైల్)



వేగంగా నిర్వహిస్తున్న ఓపెన్ ఆడిటోరియం పనులు

నరసాపురం: పట్టణంలో నిరుపయోగంగా ఉన్న మునిసిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను ఓపెన్ ఆడిటోరియంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించి చేపట్టిన పనులు శరవేగంగా సాగుతున్నాయి. మరో మూడు నెలల్లో పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అత్యంత విలువైన ప్రాంతంలో ఓపెన్ ఎయిర్ థియేటర్ ఉన్నప్పటికీ ప్రజలకు ఏ మాత్రం ఉపయోగం లేకుండా పోయింది. దీంతో పాటు థియేటర్ నిర్వహణ మునిసిపాలిటీకి భారంగా కూడా మారింది. చివరకు ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కృషితో మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్ స్థానంలో రూ.3.50 కోట్లతో మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియం నిర్మాణం ప్రారంభమైంది. ఏడాది క్రితం పనులు ప్రారంభించారు. పాత భవనాన్ని కూల్చేసి అక్కడ అధునాతన వసతులతో ఓపెన్ ఆడిటోరియం నిర్మిస్తున్నారు.

నడిబొడ్డున ఉన్నా నిరుపయోగం

1991లో రూ.5 లక్షల వ్యయంతో ఓపెన్ ఎయిర్ థియేటర్ భవనాన్ని నిర్మించారు. రెండెకరాల స్థలంలో మునిసిపల్ కార్యాలయం పక్కనే ఈ భవనం నిర్మించారు. అయితే థియేటర్‌లో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో వివాహాలు, ఇతర ప్రైవేట్ కార్యక్రమాల నిర్వహణకు ఏ ఒక్కరూ ముందుకు రాలేదు. అలాగే థియేటర్ ద్వారా మునిసిపాలిటీకి ఏడాదికి రూ.3 వేలు మాత్రమే ఆదాయం వస్తుందంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థమవుతుంది. థియేటర్‌కు నెలనెలా చెల్లించే కరెంటు బిల్లు, వాచ్‌మెన్ జీతం.. ఇలా ఏడాది పొడవునా థియేటర్ నిర్వహణకు వచ్చే ఆదాయం కంటే ఖర్చే ఎక్కువయ్యేది.

పట్టించుకోని టీడీపీ ప్రభుత్వం

అందుబాటులో ఎంతో విలువైన స్థలం ఉన్నా కూడా, ఆదాయం పెంచుకునే మార్గంపై గత టీడీపీ హయాంలో ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి పెట్టలేదు. ప్రస్తుతం పట్టణంలో కల్యాణ మండపాల కొరత తీవ్రంగా ఉంది. దీంతో ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను అభివృద్ధి చేయడంతో పాటు, అందుబాటులో ఉన్న విలువైన ఖాళీ స్థలంలో ఓపెన్ ఆడిటోరియం నిర్మించాలని ముదునూరి భావించి ముందడుగు వేశారు. ఓపెన్ ఆడిటోరియం అందుబాటులోకి వస్తే మునిసిపాలిటీకి ఏడాదికి రూ.లక్షల్లో ఆదాయం వస్తుంది. మధ్య తరగతి వారికి తక్కువ ఖర్చుతో ఫంక్షన్స్ చేసుకునే వెసులుబాటు కలుగుతుంది.

కార్పొరేట్ తరహాలో నిర్మాణం



నిరుపయోగంగా ఉన్న మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను రూ.3.50 కోట్లతో అధునాతన ఓపెన్ ఆడిటోరియంగా నిర్మిస్తున్నాం. కొంతమేర మున్సిపల్ జనరల్ ఫండ్స్ కూడా ఖర్చు చేస్తున్నాం. ఇక నుంచి అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు కూడా ఇక్కడే చేసుకునేలా భవనాన్ని నిర్మిస్తున్నాం. అనువైన మంచి సెంటర్‌లో పార్కింగ్‌కు కూడా ఇబ్బంది లేకుండా కొత్త ఓపెన్ ఆడిటోరియం అందుబాటులోకి వస్తుంది.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

క్లుప్తంగా

బాడవలో వేగంగా అభివృద్ధి పనులు



బాడవలో సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

యలమంచిలి: రెండో విడత గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో యలమంచిలి మండలం బాడవ గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. నిర్మాణంలో ఉన్న స్థానిక కాపు కల్యాణ మండపం చుట్టూ రూ.10 లక్షలతో ప్రహరీ, గెల్లు వారి వీధిలో రూ.5 లక్షలతో సిమెంట్ రోడ్డు, మరో రూ.5 లక్షలతో నాగమ్మ కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ పనులను వైఎస్సార్ సీపీ నాయకులు ఇలపకుర్తి నరసింహారావు (పండు), వినుకొండ మాణిక్యాలరావు (చిన్న), రావూరి రామకృష్ణ, గెల్లు చంద్రరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అడబాల వెంకటలక్ష్మి సోమవారం పరిశీలించారు.

వైద్యం ఖర్చులకు వితరణ



ఆర్థిక సాయం అందిస్తున్న బుద్ధరాజు

పాలకొల్లు అర్బన్: స్థానిక వసుధ ఫౌండేషన్ కార్యాలయంలో పలువురికి వైద్య ఖర్చుల నిమిత్తం వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు ఆదేశాల మేరకు పలువురు రోగులకు సోమవారం ఆర్థిక సాయం అందించారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్న పోడూరు మండలం పెనుమదం గ్రామానికి చెందిన ఎ.దేవీప్రసాద్‌కు రూ.10 వేలు చెక్కు, మొగల్తూరు మండలం తూర్పుతాళ్లు గ్రామానికి చెందిన అద్దాల వరలక్ష్మి వైద్య ఖర్చులకు రూ.7 వేలు, పేరుపాలెం గ్రామానికి చెందిన సత్యభరణి లీలావతికి రూ.7 వేల చెక్కులను కన్వీనర్ బుద్ధరాజు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమాల పర్యవేక్షకుడు ఎస్ రామకృష్ణ, చెరుకూరి సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 11 ఫిర్యాదులు

ఆకివీడు: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన 'స్పందన' కార్యక్రమంలో 11 ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రధాన సెంటర్‌లోని నగర పంచాయతీ లైబ్రరీ ప్రాంతం ఆక్రమణలకు గురైందని, లైబ్రరీ మూసివేయడంతో దానిలోని విలువైన పుస్తకాలు ఏమయ్యాని ఫిర్యాదు వచ్చినట్లు, స్థల వివాదం, ఇతర సమస్యలపై ఫిర్యాదులు అందినట్లు, ఆయా ఫిర్యాదుల్ని సంబంధిత అధికారులకు బట్వాడా చేసినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

ఆర్ కృష్ణయ్యను కలిసిన బీసీ నాయకులు



ఎంపీ ఆర్ కృష్ణయ్యను కలిసిన కోడే యుగంధర్ తదితరులు

భీమవరం(ప్రకాశం చౌక్): రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను హైదరాబాద్‌లో పశ్చిమగోదావరి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కోడే యుగంధర్, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు ముద్దాడ గణేష్ భవాని, పాలకొల్లు, భీమవరం, యలమంచిలి అధ్యక్షులు పితాని సత్యనారాయణ, కడలి ధర్మారావు, పొన్నమండ ముత్యాలరావు కలిశారు. ఈ సందర్భంగా చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్‌లు వెంటనే అమలు చేయాలని, విద్యావ్యవస్థలో సేవలు పెంపుపై పార్లమెంట్ సమావేశంలో ప్రస్తావించాలని ఆయనను కోరినట్లు కోడే యుగంధర్ తెలిపారు.

త్రైతసిద్ధాంత భగవద్గీత విశిష్టతను తెలుసుకోవాలి



పాండువ్వలో ప్రచారం నిర్వహిస్తున్న సేవా సమితి సభ్యులు

ఉండి: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైతసిద్ధాంత భగవద్గీత విశిష్టతను భక్తులు తప్పకుండా తెలుసుకోవాలని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక భీమవరం అధ్యక్షుడు ఉదయ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని పాండువ్వలో త్రైతసిద్ధాంత భగవద్గీతపై బృందం సభ్యులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు నాగేశ్వరరావు, వాసుదేవ, చక్రధర్‌రావు, తారకేశ్వరి, సుజాత, సత్యనారాయణ, రాము, లోకేష్, శ్రీకర్, చైతన్య, లక్ష్మి, రేఖ, యశోద, దుర్గాభవాని, భానుమతి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కాళీపట్నం పడమరలో జగనన్న ఆరోగ్య సురక్ష

మొగల్తూరు: మొగల్తూరు మండలం కాళీపట్నం పడమర గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటుచేస్తామని ఎంపీడీఓ వి.బాబ్జిరాజు తెలిపారు. ఈ శిబిరం గ్రామంలోని ఉన్నత పాఠశాల భవనంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగుతుందని, మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో పాటు మరో ముగ్గురు స్పెషలిస్టు వైద్యులు సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగంచుకోవాలని ఆయన కోరారు.

డీఎన్నార్ కళాశాలలో అదనపు కోర్సులు



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ శోభారాణి

పాలకొల్లు సెంట్రల్: కళాశాలలో సాధారణ విద్యతో పాటు అదనపు కోర్సులు బోధించనున్నట్టు ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. సోమవారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అదనపు కోర్సులపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సులో శోభారాణి మాట్లాడుతూ కళాశాలలో పిజికల్ ఎడ్యుకేషన్, రాజనీతి శాస్త్రం, తెలుగు శాఖలో వరుసగా కరాటే, గాంధీ ఎస్ స్టడీస్, తెలుగు జర్నలిజంలో సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభించామని తెలిపారు. డిగ్రీ ఫైనల్ ఇటర్ విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కరాటే ఇన్‌స్ట్రక్టర్ ధనాని సూర్యప్రకాష్ శిక్షణ ఇస్తారని చెప్పారు.

టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణతకు కసరత్తు

ఆకివీడు: పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఆయా పాఠశాలల వద్ద విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ ఎ.రవీంద్ర సోమవారం చెప్పారు. జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఉదయం 8.30 నుంచి 9.30 వరకు, సాయంత్రం స్కూల్ వదిలిన తరువాత ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు స్నాక్స్ అందజేస్తున్నామన్నారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు కొందరు విద్యార్థుల్ని దత్తత తీసుకుని విద్యాబోధన చేస్తున్నారని ఎంఈఓ వివరించారు.

పంటబోదె పూడికతీత పనులు



కేపీపాలెం నార్త్‌లో పంట బోదెలో పూడిక తీస్తున్న కూలీలు

మొగల్తూరు: తీర ప్రాంత గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. కేపీపాలెం నార్త్, సౌత్, పేరుపాలెం సౌత్, మొగల్తూరులోని నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం గ్రామాల్లోని శివారు ప్రాంతాలకు సాగు నీరందేలా పంట బోదెల్లో పూడిక తీస్తున్నారు. సోమవారం కేపీపాలెం నార్త్ గ్రామంలో పంట బోదెలో నిలిచిపోయిన మట్టి, గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులు చేపట్టినట్టు ఏపీఎం వెంకటేశ్వరరావు తెలిపారు.

నేడు ఆచంట నియోజకవర్గంలో ప్రారంభోత్సవాలు



కొడమంచిలిలో రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్‌లు

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో పెనుమంట్ర, ఆచంట మండలాల్లో సుమారు రూ.4 కోట్లతో నిర్మించిన పలు భవనాలను శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, విప్ చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్‌లతో కలిసి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు మంగళవారం ప్రారంభించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి పెనుమంట్ర మండలం సోమరాజు ఇల్లింద్రపర్రులోని రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.17.3 లక్షలతో నిర్మించి హెల్త్‌సెంటర్, రూ.20 లక్షలతో నిర్మించిన బీసీ కమ్యూనిటీ భవనం, మల్లిపూడిలో రూ.16 లక్షలతో నిర్మించిన డిజిటల్ లైబ్రరీ, రూ.24 లక్షలతో నిర్మించిన ఫుట్ ఫాత్ బ్రిడ్జిని, జుత్తిగలో రూ.21 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.17.3 లక్షలతో నిర్మించిన హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. 11 గంటల నుంచి ఆచంట మండలం భీమలాపురంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, ఆచంట వేమవరంలో రూ.21.8 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, గడపగడపకు మన ప్రభుత్వ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన రహదారులు, పెనుమంచిలిలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం రూ.21.8 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.17.3 లక్షలతో నిర్మించిన హెల్త్ సెంటర్, కందరవల్లిలో రూ.17.3 లక్షలతో నిర్మించిన హెల్త్ సెంటర్, కోడేరులో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, కొడమంచిలిలో రూ.21.8 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, రూ.17.3 లక్షలతో నిర్మించిన హెల్త్ సెంటర్‌లను ప్రారంభిస్తారు.

పాలకొల్లులో మినీ ఫంక్షన్ హాలు ప్రారంభం



ఎ సెలబ్రేషన్ ఆఫ్ మినీ ఫంక్షన్ హాలును ప్రారంభించిన మంత్రి కారుమూరి. చిత్రంలో గోపి, తదితరులు

పాలకొల్లు అర్బన్: సేవాభావంతో నిర్వహించే వ్యాపార సంస్థలు అభివృద్ధి పథంలో నడుస్తాయని సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. పాలకొల్లు పట్టణ పరిధిలోని పూలపల్లి బైపాస్‌రోడ్డులో వైఎస్సార్ సీపీ నాయకుడు అడబాల వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్మించిన ఎ సెలబ్రేషన్ ఆఫ్ మినీ ఫంక్షన్ హాలును ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మంత్రి కారుమూరికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనంద ప్రకాష్, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు మేకా శేషుబాబు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, వైఎస్సార్ సీపీ చింతలపూడి పార్టీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ డీటీడీసీ బాబు, కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ చేగొండి వెంకట హరరామజోగయ్య, మాజీ ఎమ్మెల్యే అల్లు వెంకట సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ తదితరులు పాల్గొన్నారు. పంక్షన్ హాలు అధినేత అడబాల వెంకటరమణను వారు ప్రత్యేకంగా అభినందించారు.

నరసాపురంలో జనసేన నీచరాజకీయాలు



కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పిన నాగరాజు

నరసాపురం: నరసాపురం నియోజకవర్గంలో జనసేన నీచ రాజకీయాలు చేస్తోందని అగ్నికుల క్షత్రియ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు విమర్శించారు. వైఎస్సార్‌సీపీ మత్స్యకార కార్యకర్తలు కొందరు తమ సామాజిక వర్గ సమస్యపై చర్చించేందుకు జనసేన కన్వీనర్ బొమ్మిడి నాయకర్ వద్దకు వెళ్లగా వారికి జనసేన కండువాలు కప్పి, తమ పార్టీలో చేరినట్టు తప్పుడు ప్రచారం చేయించుకున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఒడుగు రామకృష్ణ, ఒడుగు నాగరాజు, ఒడుగు నర్సింహస్వామి, వల్లభూని సుబ్రహ్మణ్యం తదితరులకు తన నివాసంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పిన నాగరాజు జనసేనతీరును తప్పుపట్టారు. మత్స్యకారులు జనసేన వైపు ఉన్నారని భ్రమ కల్పించేందుకు ఆ పార్టీ నాయకులు తంటాలు పడుతున్నారని అన్నారు. నియోజకవర్గంలో మత్స్యకార సామాజికవర్గమంతా వైఎస్సార్‌సీపీ వైపు, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజుకు అండగా ఉన్నారని వివరించారు. జనసేన నాయకర్ ఇలాంటి చీప్ ట్రిక్స్ మానుకోవాలని సూచించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నిండాయని వివరించారు. స్థానికంగా ముదునూరి ప్రసాదరాజు మత్స్యకారుల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు.

అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠపై ఘర్షణ



అమ్మవారి విగ్రహం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక రామయ్యహాలులో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనపై ఇరువర్గాల మధ్య ఘర్షణ ఏర్పడింది. 11వ వార్డు రామయ్య హాలులో ఆదివారం వీరాస్వామివార్ల సంబరం నిర్వహించారు. ఈ సంబరంలో ఒక మహిళకు అమ్మవారు కనిపించి ఈ ప్రాంతంలో ఉన్న చెరువులో తానున్నట్టు చెప్పడంతో, భక్తులు చెరువు వద్దకు వెళ్లి గుర్రపు డెక్కను తొలగించి వెతకగా అమ్మవారి విగ్రహం దొరికింది. ఆ విగ్రహానికి పూజలు చేయడం ప్రారంభించారు. ఇక్కడ విగ్రహం పెట్టడం కుదరదని సమీప పేటలో ఉన్న కొందరు క్రిస్టియన్లు గొడవ చేయడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. విగ్రహాన్ని స్వాధీనం చేసుకుని భద్రపరిచారు. తగాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆ ప్రాంతంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశామని సీఐ కె.మంగాదేవి తెలిపారు. తమ అనుమతులు లేకుండా మునిసిపల్ స్థలంలో కట్టడాలు, ప్రతిష్ఠాపనలు చేయరాదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతం ప్రశాంతంగా ఉందన్నారు.

కాలనీ వాసుల వంతెన కల నెరవేరింది



గోస్తనీనదిపై నిర్మించిన మల్లిపూడి వంతెన

పెనుమంట్ర: మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు చొరవతో పెనుమంట్ర మండలం మల్లిపూడి ఇందిరమ్మ కాలనీ, జగనన్న కాలనీ వాసుల రహదారి సమస్యకు మోక్షం లభించింది. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో నాటి అత్తిలి ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఇందిరమ్మ గృహనిర్మాణ పథకం నిమిత్తం మల్లిపూడి గ్రామంలో రామేశ్వరం, జుత్తిగ మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న గోస్తనీ ఆవతల గట్టున నాలుగున్నర ఎకరాల స్థలం సేకరించి, మల్లిపూడి గ్రామ లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ స్థలాలకు వెళ్లాలంటే మల్లిపూడిలోని వేణుగోపాలస్వామి గుడి నుంచి నత్తా రామలింగేశ్వరస్వామి గుడికి వెళ్లే పుంత రహదారి నుంచి సుమారు కిలో మీటరు ప్రయాణించాలి. దీంతో అప్పట్లో జుత్తిగ వద్ద గోస్తనీనదిపై వంతెన నిర్మిస్తానని శ్రీరంగనాథరాజు కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. అయితే అనంతరం వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఈ వంతెన సమస్యను పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ హయాంలో ఆచంట ఎమ్మెల్యేగా ఎన్నికైన శ్రీరంగనాథరాజు ఇదే కాలనీలో మరో ఎకరం 20 సెంట్ల స్థలం కొనుగోలు చేసి జగనన్న లబ్ధిదారులు 40 మందికి ఇళ్ల పట్టాలు అందజేశారు. దీంతో ఇందిరమ్మ, జగనన్న కాలనీల్లో 180 మంది వరకు పట్టాలు ఇవ్వగా, సుమారు 150 మంది గృహాలు నిర్మించుకున్నారు. ఇక్కడ రూ.24 లక్షల ప్రభుత్వ నిధులతో వంతెన నిర్మించారు. దీంతో లబ్ధిదారులు ప్రధాన రహదారికి వెళ్లేందుకు దగ్గర మార్గం ఏర్పడింది. ఫలితంగా స్థలాల విలువా పెరిగింది. ఈ వంతెనను మంగళవారం ప్రారంభించనున్నారు.

హిందూ ధర్మ ప్రచార మహోత్సవాలు

భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరం గునుపూడిలోని పంచారామ క్షేత్రం శ్రీ సోమేశ్వర జనార్దన స్వామివార్ల దేవస్థానం నందు హిందూ ధర్మ ప్రచార మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ముత్తయిదువులు పూజలు చేశారు. మయూరి కూచిపూడి నృత్య అకాడమీ కళాకారుల నాట్య ప్రదర్శన అబ్బురపరిచింది. కార్యక్రమాలను ఆలయ ఈఓ పర్యవేక్షించారు.

కాటన్ పార్కులో పర్యాటకుల సందడి






పర్యాటకులతో కళకళలాడుతోన్న కాటన్ పార్కు

నరసాపురం: నరసాపురం పట్టంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న కాటన్‌పార్కు పర్యాటకులతో కళకళలాడుతోంది. ఈ పార్కుకు వచ్చే పర్యాటకుల సంఖ్య కూడా పెరిగింది. వారాంతాలు, సెలవు దినాల్లో పర్యాటకులు పెద్ద సంఖ్యలో ఈ పార్కుకు వచ్చి ఇక్కడి అందాలను వీక్షిస్తూ.. సేదతీరుతున్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పూర్తిగా మూతపడ్డ కాటన్ పార్కుపై నేటి ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు దృష్టిపెట్టి రూ.1.14 కోట్లు ప్రణాళికా అభివృద్ధి సంఘం నిధులతో గత ఏడాది అభివృద్ధి చేయించారు. మున్సిపాలిటీ కూడా కొంతమేర జనరల్ ఫండ్స్ కేటాయించి పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పార్కులో ఏర్పాటు చేసిన లైటింగ్ పర్యాటకులను ఆకట్టుకుంటోంది. నరసాపురం పట్టణంలో రెండు ప్రధాన పార్కులు ఉన్నాయి. ఇందులో ఒకటి కాటన్ పార్కు కాగా, మరొకటి శారద థియేటర్ వద్ద బాలయ్యపార్కు.

మట్టి ట్రాక్టర్‌లతో ప్రజల బెంబేలు



పెదలంకలో వెనుక డోర్ వేయకుండా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

నరసాపురం రూరల్: పంట చేలు, ఆక్వా చెరువుల మట్టిని తరలించే ట్రాక్టర్లు మితిమీరిన వేగంతో రాకపోకలు సాగిస్తుండడంతో ప్రజలు, ప్రయాణీకులు బెంబేలెత్తుతున్నారు. ట్రాక్టర్‌లకు వెనుకవైపున ఉండే డోర్ మూయకుపోవడంతో రోడ్లపై మట్టి గడ్డలు పడి ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అనుమతుల్లేకుండా, ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా మట్టి రవాణా చేస్తుండడంతో రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

శివాలయంలో పండుగ పనులకు నాంది

ఉండి: ఉండి రాజులపేటలో వేంచేసి యున్న పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి, స్వయం భూ మహిషాసుర మర్దిని అమ్మవారి ఆలయంలో సోమవారం ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు చేతుల మీదుగా పలు అభివృ పనులకు నాంది పలికారు. అర్చకుడు సన్నిధిరాజు చలపతి ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు చేసి, పందిరి రాట పాతారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుంచి ఆలయంలో ఉన్న సరస్వతి అమ్మవారి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 24న ఆలయంలో నిర్మించిన గీతా మందిరాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. వచ్చేనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే శివరాత్రి ఉత్సవాలకు పనులను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అర్చకులు సన్నిధిరాజు కృష్ణ, శేషగిరి, టి.కిరణ్, భక్తులు పాల్గొన్నారు.